
తిరుమలశ్రీ




# రచయితలూ — బివేర్!

“ఉగాది నవలల పోటీలో ప్రథమ బహుమతి గెలుచుకున్న ప్రఖ్యాత రచయిత రాం బాబుగారు మా వూరి వాడే కావడమూ, వారికి నా చేతుల మీదుగా సన్మానం జరగడం నాకెంతో గర్వకారణాలు....” అంటూ ప్రసంగిస్తున్న ఎమ్. ఎల్. ఏ. గారిని

చూస్తూంటే రాంబాబుకు కించిత్తు గర్వం కలిగింది. అభిమానులతో సభ కిటకిటలాడుతూ వుంటే, తనకు పట్టిన ఆ గౌరవానికి ఆనందం వుప్పొంగుతుంది అతనిలో. ఎన్నాళ్ళనుండో రచయిత కావాలని తాను కన్న కలలు ఫలించాయనుకున్నాడు. ఎమ్. ఎల్. ఏ. గారు రాంబాబు మెళ్ళో పెద్ద పూలదండ వేస్తూంటే, ప్రఖ్యాత రచయిత రాంబాబుగారికీ 'జై' అన్న అరుపులతో, చప్పట్లతో సభ మార్మోగింది. సంతోషం పట్టలేక అప్రయత్నంగా వారితో పాటు తనూ అరిచాడు రాంబాబు 'జై' అంటూ.

"లే, లే.... నాలుగయిందప్పుడే" అంటూ ఎవరో పట్టుక్కుదపడంతో 'రాంబాబుకీ జై' అంటూనే కళ్ళు తెరిచాడు.

ఎదురుగా అక్కయ్య వనజ ప్రత్యక్షమయింది.

"కలలో కూడా సొంత డబ్బాయేనా? లే, లేచి ముఖం కడుక్కొని టిఫిన్ తిందువుగాని" అన్నదామె.

"కలా?" అన్నాడు రాంబాబు సంభ్రమంలో.

"ఇంతకూ ఏం కల వచ్చిందేమిటి? నీకు నువ్వే జేజేలు కొట్టేసుకుంటున్నావ్?" అంది వనజ నవ్వుతూ.

"నా నవలకు ఫస్టు ప్రైజు వచ్చిందట. మనవూరి ఎమ్. ఎల్. ఏ. గారు నాకు సన్మానం చేస్తున్నారు" అన్నాడు రాంబాబు కలను నెమరు వేసుకుంటూ, 'చక్కని కల కరిగిపోయిందే' అని చింతిస్తూ.

ఫక్కుమంది వనజ.

రాంబాబు వుడుక్కున్నాడు.

అక్కయ్య నవ్వుకు అర్థం తనకు తెలుసు. ఆ మధ్య కొన్నాళ్ళుగా రచయిత కావాలని ఎలా కలిగిందో బలీయమైన కోర్కె ఏర్పడింది తనలో. కాని ఎంత ప్రయత్నించినా ఒక్క అక్షరం కూడా వ్రాయలేక పోతున్నాడు. కలం కార్పొరేషన్ ఎద్దులా ప్రతి అక్షరం దగ్గరా ఆగిపోతుంది. రచనలు ఎలా చేయాలి? వగైరా సందేహాలు అలాగే వుండి పోయాయి. తనొక గొప్ప రచయిత అయిపోవాలన్న తపన మాత్రం తనలో నానాటికీ పెరిగిపోతోంది. తాను ప్రఖ్యాత రచయిత అయిపోయినట్లు ఈస్ట్మన్ కలర్లో కలలు కూడా కంటూ వున్నాడు ఈ మధ్య.

వనజ తనను ఆటలు పట్టిస్తూ వుంటుంది- 'ఏమండోయ్ రచయిత గారూ, మీ కలం ఎన్ని సెంటీ మీటర్లు కదిలింది?' అంటూ.

ఆడపిల్లలంతా రోజుకో నవల రాసి పడేస్తూన్న ఈ రోజుల్లో తాను ఒక్క కథైనా రాయలేక పోవడం తల కొట్టేసినట్లుగా వుంది.

'పిచ్చి పిచ్చి రాతలతో పేపరూ, టైమూ వేస్టు చేయకపోతే ఏదైనా వుద్యోగ ప్రయత్నాలు చేయ కూడదూ?' అంటూ నాన్నగారు విసుక్కోవడమూ తనకు తెలుసు.

బి. ఏ. పాసయి రెండేళ్ళ యింది. కనిపించిన వుద్యోగానికల్లా దరఖాస్తు పెడుతూనే వున్నాడు. పోస్టల్ ఆర్డర్సు పంపిస్తూనే వున్నాడు. కాని ఒక్కదానికీ ఇంటర్వ్యూ అయినా రాలేదు. పంపు తూన్న పోస్టల్ ఆర్డర్సు విలువ పెరుగుతూన్న కొద్దీ, ఇంట్లో తన విలువ తరుగుతూ వుందన్న నిజం తన కళ్ళ ముందు నగ్న నృత్యం చేస్తూ వున్న తరుణంలోనే- హఠా త్తుగా ఒక రోజున జ్ఞానోదయ మయింది రాంబాబుకు, రచనలు చేసి డబ్బూ, పేరూ జాయింటుగా సంపాయించేయవచ్చని, అందుకే అర్జంటుగా రచయిత అయిపోవా లనుకున్నాడు.

'రచనలు చేయడం ఎలా?' అన్న ప్రశ్న కుమ్మరి పురుగులా మెదడుని దొలిచేస్తూంటే, కనిపించే పత్రికలన్నీ కొనేస్తున్నాడు. రచ యితలందరి కథలూ చదివేస్తు న్నాడు- ఎక్కడైనా, ఏదైనా, క్లూ దొరుకుతుందేమోనన్న ఆశతో. ఆ మధ్య పత్రికలకయ్యే ఖర్చు చూసి, ఇంట్లో వాళ్ళు లబోదిబో మంటూనే వున్నారు.

సాయంత్రం వూరంతా బలా దూర్ తిరిగొస్తూ, ఆవేళే వచ్చిన డిసెంబర్ 'సీలిమ' ను కొనుక్కొ చ్చాడు రాంబాబు.

అందులో 'మేధావుల గొప్ప తనాలు' అన్న వ్యాసం అతన్ని బాగా ఆకర్షించుకుంది. ముఖ్యంగా చివరి పేరా బాగా ఆకట్టుకుంది-

"....మంచి సాహిత్యాన్ని సృష్టించదలుచుకున్న వారు కిటికీ బద్దలుకొట్టో, దొంగతనం చేయ డానికి ప్రయత్నించో పట్టుబడి ఒక సారి శ్రీకృష్ణ జన్మస్థానాన్ని సంద ర్శించి అక్కడ ఏకాంతంగా కూర్చుని ప్రయత్నించి చూడ వచ్చు!...."

దానిని పదేపదే చదువుకున్నాడు రాంబాబు, రచయిత కావడానికి

గిట్కా- ఏమిటో తెలిసిపోయి నట్లయింది. అంత మంచి సలహాయిచ్చిన 'విజయ' సంపాదకులకు మనసులోనే కృతజ్ఞత చెప్పుకున్నాడు.

## 2

ఉదయం తొమ్మిది గంటలకు ఇంటి నుండి బయలుదేరిన రాంబాబు, పదిన్నర వరకు తన 'ఆపరేషన్ విండో బ్రేకింగ్' కు సరయిన లొకేషన్‌ను ఎన్నుకోవడంలోనే గడిపేసాడు. చివరకు ఇందిరా నగరంలో మనుషులు మసలుతూన్న ఒక మోడర్న్ హౌస్‌ను చూజ్ చేసుకున్నాడు. చేతిలో రాయి పట్టుకుని అద్దాల కిటికీకి ఎయిమ్ చేస్తూ కౌంట్ డౌన్ చేస్తూంటే చేయి వణికింది. కాళ్ళు కూడా వణికాయి. అయినా 'ధైర్యే సాహసే లక్ష్మీ' అనుకున్నాడు.

రాంబాబు గురి తప్పలేదు. చేతిలోని మిస్సైల్ ఎగరడమేమిటి- కిటికీ అద్దాలు భళ్ళుమనడమేమిటి త్రుటిలో జరిగిపోయాయి.

ఆ తరువాత ఏం జరిగిందో రాంబాబుకు తెలియదు. వొంటి పైన స్పృహ కలిగే సరికి ఆ ఇంటి హాల్లో నలుగురి మధ్య దోషిలా నిలుచున్నాడు. బుగ్గలు

# కథకాని కథ

రెండూ బూరెల్లా వుబ్బిపోయాయి. కళ్ళు వాషర్ పోయిన కుళాయిలా కారుతూనే వున్నాయి.

"రౌడీ వెధవ! చూస్తే చదివిన వాడిలా కనిపిస్తున్నాడు. ఇదేం పోయే కాలం?" అన్నాడు ఒకతను రాంబాబును రెండు తగిలిస్తూ.

"అరగంట నుండి కనిపెడుతున్నాను, వీడు రోడ్డవతలనిల్చొని మన మేడ వంకే చూస్తున్నాడు" అంది ఒకావిడ.

"దొంగ వెధవలు! వీళ్ళకిదే బిజినెస్. బావున్న కిటికీలు బద్దలు కొట్టడమూ, కాసేపటికి ఏమీ ఎరుగనట్లు కిటికీలకు అద్దాలు బిగిస్తామంటూ రావడమూను" అన్నాడు మరో వ్యక్తి.

రాంబాబు బిక్కచచ్చిపోయి వింటున్నాడు. తన్నులు తింటున్నా అవాక్కయి చూస్తున్నాడు.

"ఇలాంటి వాళ్ళను పోలీసులకు అప్పగించాలి" అని ఆడావిడ అంటే-

"నో నో, ఈ రోగ్‌కు తగిన బుద్ధి నేనే చెబుతాను" అంటూ షర్టు కాలర్ పట్టుకుని రాంబాబును గుంజుతూ, ఎడా పెడా వాయించాడు మొదటి వ్యక్తి.

ఆ గుద్దులకు నోటి నుండి రక్తం వస్తూంటే, "ప్లీజ్! నన్ను కొట్టకండి, పోలీసుల కప్పగించండి" అంటూ ప్లీడ్ చేశాడు రాంబాబు.

"నిన్ను పోలీసుల కప్పగిస్తే ఏం లాభంరా? మరోసారి ఇటువంటి తప్పుడు పనులు చేయకుండా నీకు దేహశుద్ధి చేస్తే బాగా గుర్తు వుంటుంది" అంటూ ఆ వ్యక్తి రాంబాబును చితగ్గొట్టి, డామేజ్‌కు కాంపెన్సేషన్‌గా అతని రిస్టు వాచీ లాక్కుని విడిచి పెట్టాడు.

తిన్న దెబ్బలకంటె, జరిగిన అవమానంకంటె, తన ప్లాన్ ఎందుకు మిస్ ఫైర్ అయిందా అన్న ఆలోచనే రాంబాబుకు ఆందోళన కలిగించింది.

## 3

ఆ షాక్ నుండి తేరుకునే సరికి వారం, పది రోజులు పట్టింది రాంబాబుకు. అంత జరిగినా నిరుత్సాహపడలేదతను. ఈసారి కిటికీల జోలికి పోకూడదు, అవి తన కచ్చి రా లే దు, అనుకున్నాడు. ఏదైనా దొంగతనం చేసినట్లయితే జైలుకు వెళ్ళడం సులభం అని భావించాడు. అయితే రచనలు ఎలా చేయాలి? అన్నంత సమస్యగానూ తయారయింది- దొంగతనం ఎలా చెయ్యాలి? అన్నది. ఏం దొంగిలించాలి? ఎక్కడ దొంగిలించాలి? ఎలా దొంగిలించాలి? అన్న ప్రశ్నలను గూర్చి రెండు రోజులు బుర్ర పగుల గొట్టుకున్న మీదట ఒక నిశ్చయానికి వచ్చాడు.

హోటల్ దీపక్ ఎప్పుడూ సందడిగానే వుంటుంది. సందడి తక్కువగా వున్న వేళ చూసుకుని లోపల అడుగు పెట్టాడు రాంబాబు తన ప్లాన్‌లోని సెకండ్ ఫేజ్‌ను గూర్చి ఆలోచిస్తూ. టిఫిన్ తిని, కాఫీ త్రాగాడు. తరువాత ఎవరూ చూడకుండా ఓ స్టీల్ సాసరూ, రెండు స్పూన్లూ జేబులో పెట్టుకున్నాడు. కౌంటర్లో బిల్లిచ్చి, డబ్బు తీస్తున్నట్లు నటిస్తూ, మానేజర్ చూసేలా దొంగిలించిన సాసరూ, స్పూన్లూ పైకి తీశాడు. తక్షణం పట్టుబడ్డాడు. వాటి పైన హోటల్ పేరుంది.

వెంటనే మానేజర్ పోలీసులకు ఫోన్ చేస్తాడని ఆశించిన రాంబాబుకు ఆశాభంగమే అయింది. సర్వర్లు వచ్చి రాంబాబును నాలుగు తన్ని లోపలికి లాక్కుపోయారు.

"పోలీసులకు అప్పగించండి మొర్రో" అని రాంబాబు మొత్తుకుంటున్నా లెక్క చేయకుండా, సర్వర్లంతాచేరి బండ బూతులు తిడుతూ అతనితో ఫుట్‌బాల్ ఆడుకున్నారు. అంతటితో వూరుకోకుండా చీకటి పడేంత వరకూ అతని చేత పిండి రుబ్బించి మరీ విడిచి పెట్టారు.

ప్రఖ్యాత రచయిత అయ్యే నిమిత్తం జైలుకు వెళ్ళాలని తాను చేసిన సెకండ్ అటెంప్ట్ అలా ఫెయిలయ్యే సరికి నిజంగానే ఏడుపొచ్చింది రాంబాబుకు. జైలుకు వెళ్ళడానికి అంత కష్టపడాలా అనుకుని విస్తుపోయాడు.

# 4

దొమ్మి యుద్ధంలో గాయపడి దెబ్బలు నాక్కుంటూ మూల కూర్చున్న కుక్కపిల్లలా, మరో వారం రోజులు వంటి నొప్పులు తగ్గేంతవరకు ఇంటిపట్టునే వుండిపోయాడు రాంబాబు. అయినా పులుపుచావని చింతలా, పట్టు విడువని విక్రమార్కుడిలా తరువాతి కార్యక్రమాన్ని గూర్చి ఆలోచించసాగాడు. రెండుసార్లు తీవ్ర పరాభవం జరిగినా ప్రఖ్యాత రచయిత అయిపోవాలన్న వుబలాటం ఇసుమంతయినా తగ్గలేదు. 'నీలిమ' వ్యాసం చదివాక, శ్రీకృష్ణుడిలా సాహిత్యంకూడా జెయిల్లోనే పుడుతుందన్న విషయం అతనికి బాగా అప్పీలింగ్‌గా కనిపించింది. అంతకుముందు కొందరు ప్రఖ్యాత రచయితల, నవలాకారుల జీవిత చరిత్రలను చదివాడు తాను. ఈ నాడు ప్రపంచ ప్రఖ్యాతిచెందిన రచయిత లంతా 'రచయిత'లుగా మారింది జెయిల్లోనేనని తెలుస్తోంది. కనుక 'ఎన్ని అవాంతరాలు వచ్చినా, ఎన్ని ఇబ్బందులకు లోనైనా తప్పకుండా జైలుకు వెళ్ళాలి, రచయితగా తిరిగిరావాలి' అన్న దృఢ నిశ్చయానికి వచ్చాడు. ఈ సారి తన స్ట్రాటజీ మార్చాలనుకున్నాడు.

రాంబాబు భంగపాటు చెందిన రెండు పర్యాయాలూ వనజకు ఏదో అనుమానంగానే వుంది. రిస్టువాచీ ఏదని అడిగితే, ఎవరో ఫ్రెండ్ పెళ్ళికి వెళ్ళాలంటే ఎరు విచ్చా నన్నాడు. బట్టలు చినిగిపోయాయేం

ముఖం వుబ్బిందేం, వాళ్ళంతా వాసిందేం అంటే—స్నేహితులతో 'కరాటే' నేర్చుకుంటున్నానన్నాడు. వనజ నమ్మిందో లేదో కాని, మళ్ళీ ఆ వూసెత్తలేదు.

అప్పుడప్పుడు సిటీ బస్‌లలో పిక్ పాకెట్లను పట్టుకొని పోలీసులకు అప్పగించటం జ్ఞాపక మొచ్చింది రాంబాబుకి.

ఆ వేళ సిటీబస్‌లో ట్రావెల్ చేస్తూ ఎవరిదో పాకెట్ పిక్ చేయబోతూ పట్టుబడ్డాడు రాంబాబు. ఇక నేం? దేహశుద్ధి జరగటమేమిటీ, పోలీసుల చేతుల్లో పడటమేమిటి చకచకా జరిగిపోయాయి.

మాజిస్ట్రేట్ ఫైన్ వేశాడు. కాని తాను జెయిలుకు వెళతా నన్నాడు రాంబాబు. నెల్లాళ్ళ జైలు శిక్ష పడింది.

కటకటాలవెనుక ప్రవేశించేసరికి అక్కడకు చేరుకునేందుకు తాను పడిన కష్టాలను మరిచిపోయాడు రాంబాబు. ఆనందంతో వుక్కిరి బిక్కిరయ్యాడు. సంతోషం పట్ట లేక విజల్ కూడా వేశాడు. వెంటనే గార్డు వచ్చి నెత్తిమీద ఒక జెల్ల కాయ ఇచ్చాడు 'ఇందేం నీ అబ్బ చోటనుకున్నావా?' అంటూ.

చీకటి పడేసరికి రాంబాబులో ఏదో తెలియని దిగులు, భయము మొదలయ్యాయి. ఆ నాలుగు గోడల మధ్య జీవితం, కటిక చీకటి, ఒంటరితనము, తక్కిన క్రిమినల్స్ మధ్య కాలక్షేపము- జబ్బు చేసిన వాడిలా అయిపోయాడు. ఇంటిదగ్గ తనవునికి తెలియక తల్లిదండ్రులు ఎంత తల్లడిల్లిపోతున్నారో అన్న ఆవేదన, బెంగ క్రమ్ముకున్నాయి. భయానికో ఏమో, విరోచనాలు కూడా పట్టుకున్నాయి. రెండు, మూడు రోజులు వాటితో బాధపడ్డాడు.

అయితే, తన లక్ష్యం గుర్తుకు రావడంతో ధైర్యం తెచ్చుకున్నాడు. గార్డ్సును మంచి చేసుకుని తెల్ల కాగితాలు సంపాదించాడు. పెన్ను తనదగ్గరే వుంది. ఇతర క్రిమినల్స్‌వలె కాక రాంబాబు ఎడ్యుకేటెడ్ కావడంతో, జెయిల్ గార్డుకు అతనిమీద సదభిప్రాయం ఏర్పడింది. అందుకే అతను కోరగానే తెల్ల కాగితాలు లభించాయి.

ఎదురుచూసిన క్షణాలు కళ్ళెదుట నిలవడంతో వుత్సాహంతో పెన్ తీశాడు రాంబాబు. తనలో రచయిత వుద్భవించ బోతున్నాడు. తనకొరకు తన కుటుంబం అందో

శన చెందినా ప్రఖ్యాత. రచయితగా రూపొందిన తనను చూసి అంతకు కొన్నిరెట్లు ఆనందాన్ని అనుభ విస్తారు లెమ్మనుకున్నాడు. తనకు జ్ఞాపకమున్న ప్రసిద్ధ రచయితల్ని-ముఖ్యంగా జైల్లో రచనలు చేసిన వారిని-తలుచుకుని రచనకుపక్రమిం చాడు.

ఆదిలోనే సంధిగ్ధం — కథ రాయాలా, కవితరాయాలా అని. కవితతోనే ఆరంభించా లనుకునే సరికి 'శ్రీశ్రీ' గుర్తుకొచ్చాడు. ఆ వెనుకే 'మహా ప్రస్థానమూ' వచ్చింది. అంతలోనే ఆరుద్ర తన 'కూనలమ్మ పదాల'తో పోటీపడ్డాడు.

అందుకే—

'అలహాబాద్ తీర్పువిని
అరాచకం రేగిందని
అత్యవసర పరిస్థితి విధిస్తే
సాగదమ్మ ఎన్నాళ్ళో ఓ
ఇందిరమ్మా!'

—అని రాశాడు రాంబాబుతన తొలి కవిత. దానిని చదువుకుని తెగ మురిసిపోయాడు.

'గర్జించు రష్యా—ఘూర్ణించు రష్యా' అన్నాడుశ్రీశ్రీ ఒకప్పుడు.

'లేచింది జనతా
చూపింది ఘనత
మారింది ప్రభుత్వం
మాసింది బానిసత్వం....'

— అన్నాడు రాంబాబు ఇప్పుడు.

ఆ విధంగా ఆ రుద్ర శ్రీశ్రీలను కలబోసి తన గేయ కవితను రాసేశాడు రాంబాబు. దానిని పదేపదే చదువుకున్నాడు. ఒక్కొక్క రీడింగ్‌కూ 'శ్రీశ్రీ' అంత ఎత్తు ఎదిగిపోయాడు. 'ఆరుద్ర'లా గెడ్డం పెంచేశాడు ఊహల్లోనే.

తన 'ఆణిముత్యాన్ని' ఎవరికైనా వినిపించేంతవరకూ మనసు ఆగలేదు తానొక రచయిత అయ్యాడన్న శుభవార్త లోకానికి చాటాలి!

వెంటనే గార్డును పిలిచి తన కవితను చూపించాడు. దానిని చదివిన గార్డు ఓసారి రాంబాబును ఎగాదిగా చూశాడు. అతగాడలా చూస్తూంటే కాలర్ ఎగరేశాడు రాంబాబు.

గార్డు ఆ కాగితం పట్టుకుని తిన్నగా జెయిలర్ రూమ్‌కు పరుగెత్తాడు. తన రచనకు జరిగే పబ్లిసిటీని తలచుకుని మురిసిపోయాడు రాంబాబు.

అయిదు నిముషాల తరువాత జెయిలర్ ఆఫీసురూమ్‌లో ప్రవేశ పెట్టబడ్డాడు రాంబాబు.

ఆపాదమస్తకం పరీక్షగా చూశాడు జెయిలర్.

"నీ పేరేమిటి?" అన్నాడు కర్కశంగా.

"రాంబాబు." సగర్వంగా జవాబిచ్చాడు.

"నువ్వు దిగంబర కవివా?"

కంగారుగా తన వొంటిని చూసుకున్నాడు రాంబాబు. ఫరవా లేదు, వొంటిమీద దుస్తులున్నాయి!

"అదేమిటి సార్! నా వొంటి మీద దుస్తు లున్నాయిగా? మీరు కళ్ళజోడు మార్చేయాలి" అని మేళమాడాడు.

"షటప్!" చెంప ఛెళ్ళుమంది.

బిక్కచచ్చిపోయాడురాంబాబు.

"నీ రాతలు చూస్తుంటే నువ్వు నక్సలైట్‌వని అనుమానంగా ఉంది. నిజం చెప్పు? నువ్వు ఏ గ్రూప్‌కి చెందినవాడివి?" అన్నాడు జెయిలర్ వురుముతూ.

పిడుగు పడినట్లు అదిరిపడ్డాడు రాంబాబు. అతనికంతా అయోమయంగా వుంది. "నేను ఏ లైట్‌నూ కాదు మొర్రో" అన్నా జెయిలర్ నమ్మలేదు.

"వీణ్ణి డార్క్ సెల్‌లో సాలిటరీ కన్‌ఫైన్‌మెంట్‌లో వుంచు. నిజం చెప్పేంతవరకూ పచ్చి మంచి నీళ్ళయినా ఇవ్వొద్దు" అంటూ ఆదేశించాడు గార్డును.

అది వింటూనే తెలివితప్పి పడిపోయాడు రాంబాబు.

• • •

మర్నాడు విజిటింగ్‌కు వచ్చిన జెయిల్ సూపర్నెంట్‌తో తనగోడు చెప్పుకుని వాపోయాడు రాంబాబు.

ప్రఖ్యాత రచయితగా రూపొందాలన్న అభిలాషతో తాను చేసిన అడ్వెంచర్స్‌ను, జైలుకు కోరి రావడంలోని తన ధ్యేయాన్ని ఆయనకు విన్నవించుకున్నాడు. తన తండ్రి అడ్రసును ఇచ్చాడు. సూపర్నెంటు మంచివాడు కావడంతో రాంబాబు తెలివి తక్కువకు బాగా చీవాట్లుపెట్టి, విద్యావంతుడైన ఒక యువకుడి జీవితం నాశనం కాకుండా కాపాడాడు. రాంబాబు తండ్రి వచ్చి ఫైన్ కట్టడంతో, ఇంకెప్పుడూ అటువంటి పిచ్చి పిచ్చి రాతలు రాయొద్దంటూ రాంబాబుకు వార్నింగిచ్చి విడిచి పెట్టేసాడు.

హీరోలా యింటికి తిరిగి రావాలనుకున్న రాంబాబు, ఎలక్షన్‌లో డిపాజిట్ కూడా దక్కని వాడిలా, జీరోలా తల వాల్చుకున్నాడు.

ఆ తరువాత రచనల జోలికి వెళ్ళాడా అంటే— సందేహమే!

*